


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
04-02-2026
పేజీలు: 02



## భారతదేశం వదిలి వెళ్లిపోండి

భారతదేశ పౌరుల వ్యక్తిగత గోప్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మెటా యాజమాన్యానికి గట్టి హెచ్చరికలు జారీ చేసింది. వాట్సాప్ ప్రైవసీ పాలసీకి సంబంధించిన కీలక విచారణలో భాగంగా, భారతీయ చట్టాలను గౌరవించని పక్షంలో ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిలిపివేసి వెళ్లిపోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు తమ ఇష్టానుసారం నిబంధనలు మార్చుకుంటే చూస్తూ ఊరుకోబోమని, దేశ ప్రయోజనాలే తమకు అత్యున్నతమని న్యాయస్థానం ఈ సందర్భంగా తేల్చి చెప్పింది. ముఖ్యంగా వినియోగదారుల డేటా షేరింగ్‌పై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "మా దేశ ప్రజల గోప్యతతో మీరు ఆటలాడలేరు. ఇక్కడి డేటాలోని ఒక్క అక్షరాన్ని గానీ, కనీసం ఒక అంకెను కూడా ఇతరులతో పంచుకోవడానికి మేము అనుమతించము" అని ఆయన వ్యాఖ్యానించారు. భారతీయ డేటా భద్రత విషయంలో మెటా అనుసరిస్తున్న మొండి వైఖరిపై ధర్మాసనం తీవ్ర అసహనాన్ని ప్రదర్శిస్తూ, విదేశీ సంస్థలు స్థానిక చట్టాలకు లోబడి పని చేయాల్సిందేనని కరాఖండిగా చెప్పింది. వాట్సాప్ తీసుకొచ్చిన వివాదాస్పద ప్రైవసీ పాలసీ అప్‌డేట్స్ గత కొంతకాలంగా దేశంలో చర్చనీయాంశంగా మారాయి. వినియోగదారుల సమాచారాన్ని ఇతర ఫేస్‌బుక్ అనుబంధ సంస్థలతో పంచుకోవడం ద్వారా ప్రైవసీ హక్కులకు భంగం కలుగుతోందని దాఖలైన పిటిషన్లపై కోర్టు సుదీర్ఘంగా విచారిస్తోంది. లాభాల కంటే పౌరుల ప్రాథమిక హక్కులే ముఖ్యమని, టెక్ కంపెనీలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం దేశ నిబంధనలను అతిక్రమించడం సరికాదని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఈ తీర్పు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ సంస్థలకు ఒక బలమైన సందేశాన్ని పంపింది.



## తెలంగాణలో పెరగనున్న భూముల ధరలు


తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూముల ధరలను సవరించడంపై పూర్తిగా అధ్యయనం చేయాలని తాజాగా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ నిర్ణయం తీసుకుంది. దీనిపై త్వరలో రాష్ట్రంలో భూముల విలువను పెంచనున్నారనే వార్తలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గత ఏడాది ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న భూముల విలువను సవరించేందుకు ప్రతిపాదనలు రెడీ చేసింది. ఆ తర్వాత భూముల విలువను పెంచాలని నివేదికలు కూడా సిద్ధం చేశారు. అధికారులు ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం ప్రస్తుతం ఆ నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టింది. జీహెచ్ఎంసీలో చేపట్టినట్లు రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువను సవరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీంతో భూముల విలువను పెంచడంపై అధ్యయనం చేయాలని స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో త్వరలో భూముల ధరలను ప్రభుత్వం పెంచడంపై నిర్ణయం తీసుకోనుందని చెబుతున్నారు. భూముల ధరలు పెరిగితే రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ ఛార్జీలు పెరుగుతాయి. ఇది రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై కాస్త ప్రభావం చూపించనుంది.

**కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు**

ఇక తెలంగాణలో రిజిస్ట్రేషన్ల ద్వారా అధిక ఆదాయం వస్తున్న ప్రాంతాల్లో కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇక ప్రభుత్వం పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఒకేచోట చేర్చి సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. అన్నీ రిజిస్ట్రార్ కార్యాలయలు ఒకేచోట ఉండేలా భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. ఇక్కడ భూములు రిజిస్ట్రేషన్లతో పాటు మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు కూడా చేయనున్నారు. ఇక ఈ భవనాలకు ఇటీవల కొన్ని జిల్లాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తైన తర్వాత ఇవి అందుబాటులోకి రానున్నాయి. ఇక ఈ భవనాల్లో అనేక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. వృద్ధులు, వికలాంగులకు వెయిటింగ్ హాల్స్, ఫీడింగ్ కోసం గర్భిణులకు ప్రత్యేక రూమ్‌లు వంటివి ఉంటాయి. ఇక ఇక్కడ మ్యారేజ్ హాల్స్ కూడా ఉంటాయి. ప్రతి జిల్లాలోనూ సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించనున్నారు.

## 9 ఏళ్లలో 4 భాషల్లో 25 చిత్రాలతో ఇండియన్ సినిమా క్వీన్‌గా మారిన రశ్మిక మందన్న

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో 9 ఏళ్ల జర్నీ పూర్తి చేసుకుంది. 9 ఏళ్ల కెరీర్ లో నాలుగు భాషల్లో మొత్తం 25 మూవీస్ లో నటించింది రశ్మిక. ఈ సినిమాల్లో హిట్స్, సూపర్ హిట్స్, బ్లాక్ బస్టర్స్ తో పాటు బాక్సాఫీస్ రికార్డులు తిరగరాసిన సినిమాలు ఎన్నో ఉండటం విశేషం. హీరోయిన్స్ ప్రాంతీయంగా పేరు తెచ్చుకోవడం చూస్తుంటాం కానీ పాన్ ఇండియా స్థాయిలో వరుస విజయాలు సాధిస్తూ తన స్టార్ డమ్ క్రేజ్ చూపిస్తోంది రశ్మిక. అందం, నటన, ఆకర్షణతో దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. మరో హీరోయిన్ కు లేనంత క్రేజ్ ను సొంతం చేసుకుంటోంది రశ్మిక. వెయ్యి కోట్ల రూపాయల సినిమాలను అలవోకగా అందుకుంటూ ఇండియన్ సినిమా క్వీన్ గా మారింది. రశ్మిక నటించిన పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, థామా చిత్రాలు బాక్సాఫీస్ రికార్డులు తిరగరాశాయి. అయితే బాక్సాఫీస్ నెంబర్స్ కంటే ప్రేక్షకుల ప్రేమే తనకు ముఖ్యమని చెబుతుంటుంది రశ్మిక మందన్న. ఈ అందాలతార తన విజయాలను కొనసాగిస్తూ మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్స్ లో నటిస్తోంది. రశ్మిక నటించిన ది గర్ల్ ఫ్రెండ్ సినిమా నవంబర్ 7న పాన్ ఇండియా రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా రిలీజ్ చేసిన ఈ సినిమా ట్రైలర్ లో రశ్మిక పర్ ఫార్మెన్స్ మెస్మరైజ్ చేస్తోంది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమా రశ్మిక కెరీర్ లో మరో మైల్ స్టోన్ కాబోతోందనే ప్రెడిక్షన్స్ ట్రైలర్ సక్సెస్ తో ఏర్పడుతున్నాయి.







## తెలంగాణ ప్రజలకు ఆర్టీసీ శుభవార్త

తెలంగాణ ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ భారీ శుభవార్త అందించింది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా కొత్త బస్ స్టేషన్లు నిర్మాణానికి సిద్ధమవుతుండగా.. ఇప్పటికే ఉన్న కొన్ని బస్టాండ్లను ఆధునీకరిస్తోంది. అలాగే బస్ డిపోలను కూడా కొత్తగా నిర్మించేందుకు సిద్ధమవుతోంది. కొత్త బస్ స్టేషన్ల రాకతో పలు ప్రాంతాలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి రానుండటంతో స్థానిక ప్రజలకు రవాణా సదుపాయం రానుంది. రాష్ట్రంలో కొత్త 13 బస్ స్టేషన్లను కొత్తగా నిర్మించాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. వీటిల్లో ఇప్పటికే కొన్ని స్టేషన్ల పనులు ప్రారంభమయ్యాయి. అలాగే రెండు బస్ డిపోల నిర్మాణం చేపడుతోంది.

**శరవేగంగా బస్సు డిపోల పనులు**

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యం అందుబాటులో లేదు. దీంతో మరింత మంది ప్రజలకు బస్సు సదుపాయం కల్పించేందుకు టీజీఎస్ఆర్టీసీ ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా కొత్త బస్టాండ్ల నిర్మాణం చేపడుతోంది. పెద్దపల్లిలో రూ.11.01 కోట్లతో కొత్త బస్ డిపో నిర్మిస్తుండగా.. వీటి పనులు వేగంగా జరుగుతున్నాయి. పాత భవనాలను తొలగించి కొత్తవి నిర్మిస్తున్నారు. యార్డు లెవలింగ్ పనులు ప్రస్తుతం చేస్తున్నారు. ఇక ఏటూరు నాగారం బస్సు డిపో పనులు కూడా నడుస్తున్నాయి. 3.79 ఎకరాల్లో ఈ నిర్మాణం జరుగుతుండగా.. ఇందుకోసం రూ.5.91 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లోగా ఈ బస్సు డిపోను ప్రారంభించాలనే లక్ష్యం ఆర్టీసీ అధికారులు నిర్దేశించుకున్నారు. ఈ డిపో రాకతో బొగత జలపాతం, లక్నవరం, మేడారం, తాడ్వాయి, ఏటూరునాగారం ప్రాంతాల వైపు వెళ్లేవారి బస్సు సదుపాయం లభిస్తుంది.

## అందాల రాశీకి పెరుగుతున్న ఆఫర్స్

హీరోయిన్ గా సక్సెస్ కావడం అంత ఈజీ కాదు. ఎంతో మంది కుర్ర హీరోయిన్స్ ఇప్పటికీ స్టార్ డమ్ కోసం ఎదురుచూస్తున్నారు. అవకాశాలు వస్తున్న అదృష్టం కలిసి రాని భామల్లో రాశి ఖన్నా ఒకరు. ముందుగా ఈ చిన్నది బాలీవుడ్ లో సినిమాలు చేసింది. ఆ తర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ఈ వయ్యారి భామ. మొదటి సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అలాగే అందం, నటన పరంగాను రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి.ఇక రాశీ ఖన్నా తెలుగులో వరుసగా సినిమాలు చేసింది. యంగ్ హీరోలకు జోడీగా నటిస్తూ దూసుకుపోయింది ఈ అమ్మడు. అలాగే తమిళ్ లోనూ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో స్టార్ హీరో ఎన్టీఆర్ నటించిన జై లవ కుశ సినిమాలోనూ నటించింది.

## మహిళా న్యాయవాది దారుణ హత్య



రంగారెడ్డి జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళా న్యాయవాదిని హత్యకు గురయ్యారు. మహిళా న్యాయవాదిని ఆమె సోదరుడే హత్య చేసినట్టుగా తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు... మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 34 ఏళ్ల స్వప్న లాయర్‌గా ఉన్నారు. ఆమె ప్రస్తుతం ఆమె చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే వారి కుటుంబంలో చాలా కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. స్వప్నకు, ఆమె సోదరుడికి మధ్య ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం కేతిరెడ్డిపల్లిలోని పొలం వద్ద ఆస్తి పంచాయితీ జరిగింది. అక్కడ స్వప్నకు, ఆమె సోదరుడికి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలోనే స్వప్నపై ఆగ్రహంతో ఊగిపోయిన సోదరుడు ఆమెపై దాడి చేశాడు. పదునైన కత్తితో స్వప్న మెడపై దాడి చేసినట్లు తెలుస్తోంది. దీంతో తీవ్ర గాయాలతో స్వప్న అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. దీంతో స్థానికులు స్వప్నను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా... అయితే ఆమె మరణించినట్టుగా వైద్యులు ప్రకటించారు. ఈ ఘటన తర్వాత స్వప్న సోదరుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రస్తుతం పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా న్యాయవాదులలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఆగ్రహించిన న్యాయవాదులు నిరసనగా చేవెళ్ల కోర్టులో కార్యకలాపాలను బహిష్కరించారు. పెద్ద సంఖ్యలో న్యాయవాదులు మొయినాబాద్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని, నిందితుడిని త్వరగా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. న్యాయవాదులకు, ముఖ్యంగా మహిళా న్యాయవాదులకు భద్రతను పెంచాలని కోరారు. న్యాయవాదుల నిరసన నేపథ్యంలో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సీనియర్ పోలీసు అధికారులు... అక్కడికి చేరుకుని నిందితుడిని వీలైనంత త్వరగా అరెస్టు చేసి న్యాయం చేస్తామని న్యాయవాదులకు హామీ ఇచ్చారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# అందోల్ జోగిపేట మున్సిపల్ కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

అందోల్ జోగిపేట మున్సిపల్ కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన . 25 నెలల్లో కేవలం అందోల్ జోగిపేట మున్సిపాలిటీకి 250 కోట్ల నిధులు . మున్సిపల్ పరిధిలో మరో 320 కోట్ల అభివృద్ధి పనుల కొరకు మంత్రి దామోదర రాజనరసింహ గారు ప్రభుత్వానికి పంపిన ప్రపోసల్స్ కి త్వరలో గ్రీన్ సిగ్నల్.

రూపురేఖలు మారనున్న అందోల్ జోగిపేట మున్సిపాలిటీ

అందోల్—జోగిపేట్ మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున 20 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల అధికారిక జాబితాను ప్రకటించడమైనది. ఈ మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా, సుమారు 16,550 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించగల అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపింది. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో అందోల్—జోగిపేట్ ప్రాంతంలో ఇప్పటికే కొనసాగుతున్న, మంజూరైన మరియు రాబోయే కీలక అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకొస్తున్నాము.

మంత్రి దామోదర్ రాజనరసింహ గారి కృషితో మంజూరై కొనసాగుతున్న అభివృద్ధి పనులు:

జోగిపేట్ నుంచి అజ్జమర్రి వరకు రహదారి అభివృద్ధికి రూ.80 కోట్లు, సంగుపేట నుంచి అన్నసాగర్ వరకు డివైడర్ లైట్లతో కూడిన 4 లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు, అంబేడ్కర్ చౌరస్తా నుండి మధ్యరంగం, NH—161 వరకు రోడ్డు విస్తరణ ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల్లో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.20 కోట్లు, కొత్త మున్సిపల్ కార్యాలయ



భవనం నిర్మాణానికి రూ.6 కోట్లు, 150 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు (దీనిలో 50 పడకల మాతా—శిశు సంరక్షణ MCH విభాగం)కు రూ.60 కోట్లు,నర్సింగ్ కళాశాల స్థాపనకు రూ.43 కోట్లు, రూ.2 కోట్లతో వివేకానంద పార్క్ అభివృద్ధి, రూ.2 కోట్లతో అందోల్ చెరువు సుందరీకరణ, రూ.5 కోట్లతో చెరువు ఒడ్డున సాంస్కృతిక (కల్చరల్) భవనం నిర్మాణం,రూ.5.75 కోట్లతో RDO కార్యాలయం & నివాస సముదాయం నిర్మాణం, రూ.2 కోట్లతో మున్సిపల్ ప్రవేశద్వారం వద్ద (సంగుపేట అండర్‌పాస్) వెల్‌కమ్ ఆర్చ్ నిర్మాణం. ఈ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల ద్వారా రహదారులు, పరిపాలన, ఆరోగ్యం, విద్య, పట్టణ సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక భద్రత వంటి అన్ని రంగాలు సమగ్రంగా బలోపేతం కానున్నాయి. ప్రజాసమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల విస్తరణ, పారదర్శక పాలనతో పాటు సామాజిక న్యాయమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పార్టీ అభ్యర్థులు ప్రజలకు భరోసా ఇస్తున్నారు.



## ప్రజలకు నచ్చేది జగన్‌కు నచ్చదు: మంత్రి సత్యకుమార్

ప్రజలకు నచ్చేది వైసీపీ అధినేత జగన్‌కు నచ్చదని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. గతంలో సుదీర్ఘకాల ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేతలు రోడ్ల మీదకు వచ్చేవారని, ప్రస్తుతం ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాల కోసం నేతలు రోడ్డు మీదకు వస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలన్నా, రాజకీయ నాయకులన్నా ప్రజల్లో మంచి అభిప్రాయం లేకుండా పోయిందన్నారు. ఫిబ్రవరి 4న క్యాన్సర్ డే పురస్కరించుకొని రాష్ట్రంలో ఉన్న కేసులు, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్రాథమిక పరీక్షలు, గుర్తించిన అంశాలు, తీసుకోబోతున్న చర్యలను మంత్రి సత్యకుమార్ వివరించారు. రాష్ట్రంలో 2007-2008 నుంచి 2025-26 జనవరి 24వరకు క్యాన్సర్ తో బాధపడుతున్న 6 లక్షల 32 వేల 426 మందికి ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా ఉచితంగా అందించిన వ్యయం 4,751.82 కోట్లకు చేరుకుందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 675.66 కోట్లను క్యాన్సర్ పీడితులకు వైద్యాన్ని అందించేందుకు ఖర్చు పెట్టినట్లు చెప్పారు. 2025-26 లో జనవరి 24 వరకు 585.22 కోట్లు ఖర్చు పెట్టినట్లు పేర్కొన్నారు.



## ప్రయాణికుడి బంగారు బ్రేస్‌లెట్ మాయం.. ఇండిగోపై రూ.60 వేల పరిహారం

ప్రయాణికుడి సామానును భద్రంగా కాపాడడంలో విఫలమైనందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై హైదరాబాద్ జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్—I తీవ్రంగా స్పందించింది. సేవలో లోపం ఉన్నట్లు తేల్చి, బాధితుడికి రూ.60 వేల పరిహారంb చెల్లించాలని ఆదేశించింది. ఫిర్యాదుపై ఆలస్యంగా స్పందించిన తీరు కూడా తప్పేనని కమిషన్ స్పష్టం చేసింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం గంగన్నపేట గ్రామానికి చెందిన మహ్మద్ రైస్ ఖాన్ 2023 డిసెంబర్ 6న అబుదాబి నుంచి హైదరాబాద్‌కు ఇండిగో విమానంలో ప్రయాణించాడు. తన క్యాబిన్ బ్యాగ్‌లో 35.47 గ్రాముల బరువున్న 24 క్యారెట్ల బంగారు బ్రేస్‌లెట్‌ను తీసుకొచ్చాడు.

## మెగాస్టార్ పై విమర్శలు.. ఇచ్చిపడేసిన మెగా కోడలు

సోషల్ మీడియాలో పాజిటివ్ ఎంత ఉంటుందో నెగిటివ్ అంతకుమించి ఉంటుంది. ముఖ్యంగా మెగా ఫ్యామిలీకి ఫ్యాన్స్ ఎంతమంది ఉన్నారో.. అంతకుమించి యాంటీ ఫ్యాన్స్ కూడా ఉన్నారు. మెగా ఫ్యామిలీలో ఏ మంచి జరిగినా శుభాకాంక్షలు చెప్పేవారి కన్నా.. ఆ మంచిని చెడగొట్టే యాంటీ ఫ్యాన్సే ఎక్కువమంది అని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. చిరంజీవిపై విమర్శలు గుప్పించడమే వారి పని. అలా చిరుపై విమర్శలు గుప్పించిన ఒక నెటిజన్ పై మెగా కోడలు లావణ్య కొణిదెల మండిపడింది. మధ్యనే మెగా ఇంటికి ఇద్దరు వారసులు వచ్చిన విషయం తెల్సిందే. రామ్ చరణ్ - ఉపాసన రెండోసారి ట్విన్స్ కి జన్మనిచ్చారు. దీంతో మెగా ఫ్యామిలీ ఇంట పండుగ వాతావరణం నెలకొంది. సోషల్ మీడియా మొత్తం చరణ్ - ఉపాసనకు శుభాకాంక్షలు చెప్పారు. కానీ, కొంతమంది మాత్రం చిరంజీవిపై విమర్శలు గుప్పించారు. మనవడు పుట్టేసరికి చిరు హాస్పిటల్ వద్ద హడావిడి చేశారని, క్రాకర్స్ కాల్చి సందడి చేశారని.. అదే మనవరాలు క్లింకార పుట్టినప్పుడు ఇదంతా ఏమైంది.. కేవలం మనవడు పుడితేనే హ్యాపీనా



అంటూ పోస్టులు పెట్టారు. తాజాగా ఆ పోస్ట్ పై లావణ్య స్పందించింది. చిరంజీవి ఎలాంటివారో తెలియనప్పుడు ఆయన గురించి మాట్లాడవద్దని తెలిపింది. ఆయనలా ఏ పురుషుడు కూడా ఉండరు అని చెప్పింది. 'నేను సాధారణంగా ఇలాంటి ట్వీట్‌లను పట్టించుకోను. వాటిని నా టైమ్‌లైన్‌లో అలా వదిలేస్తాను. కానీ, మీ నుండి ఇలాంటిది నేను ఊహించలేదు.. ఈ ట్వీట్ చాలా అసభ్యకరంగా ఉంది, ఇది నిజంగా సంతోషకరమైన క్షణాన్ని అసహ్యకరమైనదిగా మార్చింది.



## హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అమర్‌నాథ్

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. గెలాక్సీ క్రికెట్ క్లబ్‌కు చెందిన అమర్‌నాథ్‌ను హెచ్‌సీఏ నూతన అధ్యక్షుడిగా నియమిస్తూ అంబుడ్స్‌మన్ రిటైర్డ్ చీఫ్ జస్టిస్ సురేశ్‌కుమార్ కైత్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేండ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో తీవ్ర అవకతవకలు జరిగాయంటూ అమర్‌నాథ్ కోర్టును ఆశ్రయించారు. హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో జగన్‌మోహన్‌రావు చేతిలో ఒక ఓటు తేడాతో అమర్‌నాథ్ ఓటమిపాలయ్యారు. అయితే నిబంధనలు ఉల్లంఘిస్తూ శ్రీచక్ర క్లబ్ నుంచి జగన్‌మోహన్ ఎంపిక కావడంపై కోర్టు తీర్పును అనుసరించి రెండో స్థానంలో నిలిచిన అమర్‌నాథ్‌ను హెచ్‌సీఏ చీఫ్‌గా నియమిస్తూ అంబుడ్స్‌మన్ నిర్ణయం తీసుకున్నారు. అంబుడ్స్‌మన్ సురేశ్‌కుమార్ ఆదేశాలకు అనుగుణంగా అమర్‌నాథ్ సోమవారం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది అక్టోబర్ వరకు ఆయన పదవిలో కొనసాగనున్నారు. చాలా రోజుల వరకు అధ్యక్ష పదవి ఖాళీగా ఉండరాదన్న ఉద్దేశంతో అంబుడ్స్‌మన్ సురేశ్‌కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అమర్‌నాథ్ పేర్కొన్నారు.ల



## వరుస ఆఫర్లతో బిజీబిజీ

శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస ఆఫర్లు సొంతం చేసుకుంటోంది. ఇంకా హిందీలో అరంగేట్రం చేయకముందే రెండో సినిమా ఆఫర్‌ను దక్కించుకుంది. దీన్ని బట్టి చూస్తే.. రష్మిక మందన్నా మాదిరిగా శ్రీలీల కూడా బాలీవుడ్‌లో స్థిరపడే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం శ్రీలీల ఆషికీ ఫ్రాంచైజీ మూడవ భాగంలో కార్తీక్ ఆర్యన్ సరసన నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ మూవీ ఇంకా సెట్స్ మీద ఉన్నలోపే దోస్తానా 2 చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు రణవీర్ సింగ్, శ్రీలీల, బాబీ డియోల్ కలిసి నటించిన ఒక యాడ్‌ను అట్లీ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే.

## బలూచిస్థాన్‌లో మా బలగాలు చేతులెత్తేస్తున్నాయి..

**పాక్ రక్షణ మంత్రి షాకింగ్ వ్యాఖ్యలు**

పాకిస్థాన్‌లో అతిపెద్ద రాష్ట్రమైన బలూచిస్థాన్‌లో వేర్పాటువాద సెంట్రల్ దాడులు మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నేషనల్ అసెంబ్లీలో చేసిన ప్రసంగం ఇప్పుడు చర్చనీయాంశమైంది. బలూచిస్థాన్ తిరుగుబాటుదారులను అణచివేయడంలో తమ భద్రతా దళాలు 'శారీరక వైకల్యంతో' ఉన్నాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బలూచిస్థాన్ విస్తీర్ణం పాకిస్థాన్ మొత్తం భూభాగంలో 40 శాతానికి పైగా ఉందని, కానీ జనాభా మాత్రం చాలా తక్కువని ఆసిఫ్ పేర్కొన్నారు. "ఒక నగరాన్ని నియంత్రించడం సులభం, కానీ ఇంత పెద్ద రాష్ట్రాన్ని కాపాడటం చాలా కష్టం. మా సైనికులు అక్కడ విధులు నిర్వహిస్తున్నారు, కానీ ఆ ప్రాంత విస్తీర్ణం, పర్వత ప్రాంతాల వల్ల వారు తిరుగుబాటుదారులను సమర్థవంతంగా అడ్డుకోలేకపోతున్నారు" అని ఆయన ఒప్పుకున్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 మధ్య 'ఆపరేషన్ హెరోఫ్ 2.0' పేరుతో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) విరుచుకుపడింది. ఈ దాడుల్లో దాదాపు 17 మంది భద్రతా సిబ్బంది, 33 మంది సామాన్య పౌరులు మరణించగా, పాక్ సైన్యం జరిపిన ఎదురుకాల్పుల్లో 177 మంది తిరుగుబాటుదారులు హతమైనట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈసారి దాడుల్లో మహిళా ఫైటర్లు



కూడా పాల్గొనడం పాక్ సైన్యాన్ని కలవరపెడుతోంది. నుష్కీలోని ఐఎస్ఐ కార్యాలయంపై దాడి చేసింది ఆసిఫా మెంగల్ అనే మహిళా ఫిదాయీ అని గుర్తించారు. బలూచిస్థాన్‌లో కేవలం స్వేచ్ఛ కోసం పోరాటం జరగడం లేదని, అక్కడ చమురు స్మగ్లింగ్ చేసే మాఫియా, బ్యూరోక్రసీ, వేర్పాటువాదులు కలిశారని ఆసిఫ్ ఆరోపించారు. ఇరాన్ నుంచి జరిగే పెట్రోల్ స్మగ్లింగ్ ద్వారా వీరు రోజుకు సుమారు 4 బిలియన్ పాక్ రూపాయలు ఆర్జిస్తున్నారని, అందుకే వీరు ఆఫ్ఘనిస్థాన్ మద్దతుతో అల్లర్లు సృష్టిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బలూచిస్థాన్ ప్రజలు దశాబ్దాలుగా తమ ఖనిజ సంపదను పంజాబ్ ప్రావిన్స్ దోచుకుంటోందని, తమకు కనీస సౌకర్యాలు లేవని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా చైనా పెట్టుబడి పెట్టిన గ్వాదర్ పోర్ట్ (CPEC) వల్ల స్థానికులకు ఎలాంటి ఉపయోగం లేదని, అది కేవలం వనరులను తరలించుకుపోవడానికేనని అక్కడి ప్రజల ఆగ్రహం.



## 'అమరన్' దర్శకుడితో ధనుష్

తమిళ స్టార్ హీరో ధనుష్ తన 55వ సినిమాను 'అమరన్' దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ వెలుబడింది. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ధనుష్ మరియు మమ్ముట్టి పూర్తిస్థాయిలో కలిసి నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు దాదాపు ఏడేళ్ల (2019లో వచ్చిన 'పేరంబు') తర్వాత మమ్ముట్టి తమిళ సినిమాలో నటిస్తుండటం విశేషం.

## రూ.3 వేల లోన్ కోసం వేధింపులు.. హైదరాబాద్ లో వ్యక్తి సూసైడ్

లోన్ యాప్ వేధింపులకు మరో ప్రాణం పోయింది. కేవలం రూ.3 వేల కోసం ఫోన్లు చేస్తూ బెదిరింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. హైదరాబాద్ లోని చిక్కడపల్లిలో ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లిలో నివాసం ఉండే ప్రేమ్ కుమార్ గతంలో ఓ లోన్ యాప్ ద్వారా అప్పు తీసుకున్నాడు. రూ.3 వేల రుణం తిరిగి చెల్లించకపోవడంతో లోన్ యాప్ ఏజెంట్ ఫోన్ చేసి బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఇటీవల మేడారం జాతరకు వెళ్లిన ప్రేమ్ కుమార్ కు తిరుగు ప్రయాణంలో లోన్ యాప్ ఏజెంట్లనుంచి ఫోన్ వచ్చింది. తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా వెంటనే చెల్లించాలని ఏజెంట్ డిమాండ్ చేశాడు.

